భారీ వర్షాలతో నష్టం.. రైతన్న కష్టం

పత్తిపైరులో ఇసుక మేటలు..


మంగాపురంలో పత్తిపైరులో ఇసుక మేటలు


కోతకు గురైన పత్తి చేను

తల్లాడ: మండలంలో వరుసగా కురుస్తున్న భారీ వర్షాలకు పంటలు వరద ముంపునకు గురయ్యాయి. మంగళవారం రాత్రి కూడా వర్షం పడటంతో అంతకు ముందు మూడు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలకు ఆగిన నీటితో పాటు ఇబ్బంది పడుతున్న పత్తి రైతులకు మరింత నష్టాన్ని చేకూర్చింది. మండలంలో 6వేల ఎకరాల్లో రైతులు సాగుచేశారు. తల్లాడ, మంగాపురం, పినపాక, రెడ్డిగూడెం, మల్లవరం, అన్నారుగూడెం, మిట్టపల్లి, బిల్లుపాడు, కొత్త వెంకటగిరి, రామచంద్రాపురం, వెంగన్నపేట, కేశ్వాపురం, కుర్నవల్లి, బస్వాపురం గ్రామాల్లో సాగు చేసిన పత్తి పైరులో వరద నీరు కారణంగా ఇసుక మేటలు వేశాయి. పలు చోట్ల నీళ్లు నిలిచే ఉన్నాయి. అలాగే మిర్చి, వరి పైరులో కూడా ఇసుకు మేటలు వేశాయి. మంగాపురం వద్ద రోడ్డు మీద నీరు పొలాల్లో కెళ్లి ఓ రైతుకు చెందిన పత్తి పైరులో భూమి కోతకు గురైంది. పెద్ద కాలువలను తలపిస్తోంది.

చింతకాని మండలంలో..


మున్నేరు వరదకు కొట్టుకుపోయిన పత్తిపంట

చింతకాని: నాలుగు రోజులుగా కురుస్తున్న వార్షలతో మండలంలో పంటలు, రోడ్లు ధ్వంసం, ఇళ్లు కూలగా తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రొద్దుటూరులో తేళ్లూరి సావిత్రమ్మ ఇల్లు కూలగా... చింతకాని ఎస్సీ కాలనీ వరదనీటిలో మునిగి కాలనీవాసులకు తహసీల్దార్ అనంతరాజు నిత్యావసరాలు అందించారు. అలాగే.. కోతకు గురైన ప్రొద్దుటూరు, రేపల్లెవాడ, పాతర్లపాడు గ్రామాలకు వెళ్లే రహదారికి మరమ్మతులు చేయించారు. పలు గ్రామాల రహదారులు కోతగు గురై ప్రమాదకరంగా మారడంతో వాహనదారుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇప్పటికైన అధికారులు పంటసర్వే చేసి సాయమందించాలని రైతులు, దెబ్బతిన్న రహదారుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరారు.


ప్రొద్దుటూరులో కూలిన ఇల్లు

కొట్టుకుపోయిన రోడ్డు.. ఆగని వరద

ముదిగొండ: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లన్నీ ధ్వంసం అయ్యాయి. దీంతో ఆ రోడ్లకు మరమ్మతులు చేసే నాధుడే కరువైయ్యాడు. వల్లబి వద్ద బోటికుంట చెరువు అలుగు పడి కట్ట తెగిపోవడంతో ఆర్అండ్బీ రోడ్డు పూర్తిగా ధ్వంసం కాగ.. బస్సులు, ఆటోలు, ద్విచక్రవాహనాలు కూడా తిరగలేని పరిస్థితి నెలకొంది. ఖమ్మం – వల్లబి వరకు ఆర్టీసీ బస్సులు నడిచేవి. ఇప్పుడు బాణాపురం వరకు వచ్చి రిటన్ కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా కొట్టుకుపోయిన రోడ్లకు మరమ్మతులు చేయించాలని మండల ప్రజలు కోరుతున్నారు.


వల్లబి వద్ద బోటి చెరువు వరదలతో కొట్టుకుపోయిన ఆర్అండ్బీ రోడ్డు

కట్లేరుకు కొనసాగుతున్న వరద


మునిగిన మునగతోటను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ఎర్రుపాలెం: మండలంలోని కట్లేరుకు వరద కొనసాగుతుంది. బుధవారం రాత్రి కూడా వర్షం కురియడంతో, ఎగువ నుండి నీటి వరద ఉధృతిగా ప్రవహిస్తుంది. వాతావరణ శాఖ నుంచి మరో అల్ప పీడనం ఉందని, దీంతో మరో మూడు రోజులు పాటు వర్షాలు కురుస్తాయని ప్రకటనలు వస్తుండటంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతుంది. ఇప్పటికే మండలంలోని కట్లేరు పరివాహక ప్రాంతంలోని పలు గ్రామాల్లో పత్తి, వరి పొలాలు మునిగిపోయాయి. జమలాపురం గ్రామంలోని పెద్ద చెరువుకు పెద్ద ఎత్తున వరద రావడంతో అలుగు పొంగి పొర్లుతుంది. చెరువు అలుగుకు ప్రమాదం కలుగుతుందేమోనని స్థానికులు ఆందోళన వెలు బుచ్చుతున్నారు. పెద్ద గోపవరం లింక్ రోడ్డులో మునగ చేను కట్లేరు వరదకు మునిగిపోయింది. ఈ తోటను బుధవారం సీపీఎం మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య, నాయకులు సగ్గుర్తి సంజీవరావు, నాగులవంచ వెంకట్రామయ్య, కోటి సుబ్బారెడ్డి, దూదిగం బసవయ్య తదితరులు పరిశీలించారు. సకాలంలో ప్రభుత్వం స్పందించి బాధిత రైతాంగాన్ని ఆదుకోవాలని కోరుతున్నారు.


అలుగుపోస్తున్న జమలాపురం చెరువు

డిప్యూటీ సీఎం ఆదేశాలు బేఖాతర్

- ఆక్రమణకు గురైన నాలాను పట్టించుకోని కమిషనర్
- పైగా వరద బాధితులతో వాగ్వాదం


కల్వర్టుకు మరమ్మతు చేయిస్తున్న ఏఈ, కౌన్సిలర్


ప్రజలతో వాగ్వాదానికి దిగిన మున్సిపల్ కమిషనర్ షఫీ ఉల్లా

మధిర: మధిర మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపట్టడమే కాక ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఇటీవల ఆదేశించారు. అయితే, మున్సిపల్ కమిషనర్ అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. భారీ వర్షాలతో ఇటీవల మధిర ముంపునకు గురికాగా ఈనెల 1న పర్యటించిన భట్టి.. నాలాలపై ఆక్రమణలను తొలగించాలని, సుందరయ్య నగర్కు వెళ్లే మార్గంలో లోతైన గుంటను పూడ్చించాలని మున్సిపల్ కమిషనర్ షఫీ ఉల్లాను ఆదేశించారు. అలాగే, ముస్లిం కాలనీలో ఇళ్లన్నీ నీట మునిగినందున పారిశుద్ధ్య పనులు చేపట్టి మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. అయితే, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ వీ.పీ.గౌతమ్ బుధవారం మధిరకు వస్తున్నారనే సమాచారంతో కమిషనర్ బుధవారం ముస్లిం కాలనీకి వెళ్లారు. దీంతో ప్రజలకు ఆగ్రహం వ్యక్తం చేస్తూ తమ ఇళ్లు ముంపునకు గురై నాలుగు రోజులవుతుంటే ఇన్నాళ్లు ఏం చేశారని ప్రశ్నించారు. ఈక్రమంలో సర్దిచెప్పాల్సిన కమిషనర్ సహనం కోల్పోయి ఇలాగే గొడవ చేస్తే పోలీసులను పిలిపిస్తానని బెదిరించారు. అయితే, వారు బాధలో ఉన్నందున కొద్దిసేపు శాంతియుతంగా ఉండాలని పక్కనే ఉన్న తహసీల్దార్ రాంబాబు సూచించినా కమిషనర్ వినిపించుకోలేదు. చివరకు మధిర టౌన్ పోలీసులు పరిస్థితిని సముదాయించారు. ఆతర్వాత దురుసుగా ప్రవర్తించిన కమిషనర్పై చర్యలు తీసుకోవాలనే డిమాండ్తో ముస్లిం కాలనీకి చెందిన వరద బాధితులు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.

కల్వర్టుకు మరమ్మతులు..

సుందరయ్య నగర్లోకి వెళ్లే రోడ్డులో ఏర్పడిన గుంతను మున్సిపల్ ఏఈ నరేష్రెడ్డి, కౌన్సిలర్ మల్లాది వాసు మరమ్మతులు చేయించారు. కుంగిపోయిన కల్వర్టును జేసీబీతో తీయించి బుంగలు వేశారు. ఈ సందర్భంగా సుందరయ్య నగర్ వాసులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

గెస్ట్ లెక్చరర్లకు దరఖాస్తుల ఆహ్వానం

సత్తుపల్లి: సత్తుపల్లిలోని జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న ఇంగ్లీష్, హిందీ, హిస్టరీ, కామర్స్, ఫిజిక్స్ అధ్యాపకుల పోస్టులకు తాత్కాలిక ప్రాతిపదికన నియామకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.గోపి తెలిపారు. ఈ నెల 11వ తేదీన ఉదయం 10 గంటల నుంచి ఇంటర్వ్యూ పద్ధతి ద్వారా ఎంపిక చేయబడతారని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 4వ తేదీ నుంచి 9వ తేదీ వరకు పూర్తి బయోడేటాతో జిరాక్స్ సర్టిఫికెట్లతో దరఖాస్తును కళాశాలలో అందించాలని తెలిపారు.

నిబంధనలు పాటించాలి


మధిర: మాట్లాడుతున్న సీఐ మధు

మధిర/కల్లూరురూరల్: వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ప్రతి ఒక్కరూ నియమ, నిబంధనలు పాటించాలని మధిర సీఐ మధు, ఎస్సై షాకీర్ తెలిపారు. బుధవారం మధిర రూరల్ పోలీస్స్టేషన్ ఆవరణలో గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేయగా.. కల్లూరులో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పోలీస్ అనుమతి తీసుకొని గణపతి విగ్రహాలను ఏర్పాటు చేయాలని కోరారు. డీజే సౌండ్ సిస్టంకు అనుమతి లేదని, మండపాల వద్ద 24 గంటల పాటు కమిటీ సభ్యులు ఉండాలని సూచించారు. రాత్రి 10 గంటల వరకే కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ సదస్సులో మధిరరూరల్ ఎస్సై లక్ష్మీ భార్గవి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై దాడి అనాగరికం

చింతకాని: ఖమ్మం మున్నేరు పరివాహక ప్రాంతంలో వరద బాధితులను పరామర్శించడానికి వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై అధికార పార్టీకి చెందిన కొందరు దుండగులు దాడి చేయటం సరైంది కాదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య తెలిపారు. బుధవారం మండలంలోని లచ్చగూడెంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారం ఎవరికి శాశ్వతం కాదని, ఇటువంటి పనులను మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి వెంకట్రామయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదిస్తాం


అష్ణగుర్తిలో పంటలను పరిశీలిస్తున్న ఏఓ మయాన్ మంజుఖాన్

వైరారూరల్: భారీ వర్షాలకు దెబ్బతిన పంటల వివరాలను సర్వే నిర్వహించి పంట నష్టాన్ని ప్రభుత్వానికి నివేదిస్తామని మండల వ్యవసాయ శాఖ అధికారి మయాన్ మంజుఖాన్ అన్నారు. మండలంలోని అష్ణగుర్తి, లింగన్నపాలెం, విప్పలమడక, గొల్లెనపాడు గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించి వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. వైరా మండలంలో వరి 2,000 ఎకరాలు, పత్తి 350 ఎకరాలకు నష్టం వాటిల్లిందని తెలిపారు. ఏఈఓలు తమ క్లస్టర్ల వారీగా సర్వే నిర్వహించి 33శాతం పైగా దెబ్బతిన పంట పొలాల వివరాలను సేకరించి పై అధికారులు నివేదిస్తామన్నారు. ఏఓలు సైదులు, కీర్తి, రాజేష్, వెంకటనర్సయ్య, రైతులు పాల్గొన్నారు.

జాతీయ విపత్తుగా ప్రకటించండి

సత్తుపల్లిరూరల్: రాష్ట్రంలో తుఫాన్ కారణంగా ప్రాణ, ఆస్తినష్టం జరిగి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని దీనిని జాతీయ విపత్తుగా ప్రకటించి కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ కోరారు. బుధవారం సత్తుపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వంతో పాటు ప్రతి ఒక్కరూ స్పందించి బాధితులకు చేయూత నివ్వాలని కోరారు. సమావేశంలో నాయకులు వెంకటేశ్వరరావు, ముత్యాలు, శివ, హమీద్, రంజాన్బీ, సామ్రాజ్యం, సత్యావతి, సూరమ్మ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా కిరణ్కుమార్

వైరా: ఆర్యవైశ్య మండల అధ్యక్షుడి ఎన్నికలు బుధవారం ఉత్కంఠ సాగాయి. గత వారం రోజుల నుంచి ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడి ఎన్నిక కోసం సంఘం బాధ్యులు ఏర్పాట్లు చేసి విస్తృత ప్రచారాలు చేశారు. మొత్తం 634 ఓట్లకు గానూ మిట్టపల్లి కిరణ్కు 265 ఓట్లు రాగా.. తమ సమీప ప్రత్యర్థి మిట్టపల్లి రాఘవరావుకు 123 ఓట్లు పోలయ్యాయి. 142 ఓట్ల మెజార్టీతో మిట్టపల్లి కిరణ్కుమార్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. అనంతరం అధ్యక్షుడిగా ఎన్నికైనా కిరణ్కుమార్ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి తన ఎన్నికకు సహకరించిన ఆర్యవైశ్య సంఘం బాధ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, నాయకులు మిట్టపల్లి, రామకృష్ణ, సత్యం, సైదులు, వెంకటయ్యలు అభినందించారు. ఈ ఎన్నిక కార్యక్రమంలో విశ్వేశ్వరరావు, శివశంకర్, ప్రసాద్రావు, రాంబాబు, మురళి, వెంకటరమణ, విజయ్, సందీప్, కృష్ణ సాయి తదితరులు పాల్గొన్నారు.


మిట్టపల్లి కిరణ్కుమార్ను అభినందిస్తున్న మున్సిపల్ చైర్మన్ జైపాల్

క్లుప్తంగా

పోషకాహారం తీసుకోండి


సత్తుపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న సూపర్వైజర్ మహాలక్ష్మి, సిబ్బంది

సత్తుపల్లిటౌన్: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్వైజర్ మహాలక్ష్మి అన్నారు. పట్టణంలోని అయ్యగారిపేట, హనుమాన్నగర్లలోని అంగన్వాడీ కేంద్రాల్లో బుధవారం పోషణ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ శారారాణి, ఏఎన్ఎంలు తాయమ్మ, కామేశ్వరి, అంగన్వాడీ టీచర్లు రాధ, రహ్మతున్నీసా, స్వాతి, రజిని, ఆశాలు పాల్గొన్నారు.

శాశ్వత పరిష్కారం చూపించాలి


ముంపు బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న బీజేపీ నాయకులు

వైరా: ప్రతి ఏటా వైరా మున్సిపాలిటీ పరిధిలో గల ఇందిరమ్మకాలనీ, రాజీవ్నగర్లు భారీ వర్షాలకు ముంపుకు గురవుతున్నందున ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపించాలని భారతీయ జనతా పార్టీ వైరా అసెంబ్లీ కన్వీనర్ నెల్లురు కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం బీజేపీ నాయకులతో కలిసి ఆయన ముంపు ప్రాంతాలను సందర్శించి పరిశీలించారు. అనంతరం బాధితులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇకపై ఇలా జరగకుండా కరకట్ట నిర్మించాలన్నారు. కార్యక్రమంలో దుద్దుకూరి కార్తీక్, మనుబోలు వెంకటకృష్ణ, చింతనిప్పు రామారావు, సతీష్ పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల నిర్ధారణ సర్వే వాయిదా

ఏన్కూరు: రుణమాఫీకి సంబంధించి వ్యవసాయ విస్తరణాధికారులు నిర్వహిస్తున్న కుటుంబ సభ్యుల నిర్ధారణ సర్వే కొంతకాలం వాయిదా వేయడం జరిగిందని ఏఓ నర్సింహారావు బుధవారం ఒక ప్రకటలో తెలిపారు. వర్షాల మూలంగా పంట నష్టపోయిన రైతుల పొలాల కారణంగా కుటుంబ నిర్ధారణ సర్వే వాయిదా వేస్తున్నామన్నారు. పంట నష్టపోయిన రైతులు ఏఈఓలతో సర్వే చేయించుకోవాలని కోరారు.

సాగర్కెనాల్ కట్టకు మరమ్మతు చేయాలి

కల్లూరురూరల్: వర్షాల కారణంగా కోతకు గురైన లక్ష్మీపురం బ్రిడ్జి పక్కన ఉన్న నాగార్జున సాగర్ కెనల్కు జలవనరుల శాఖాధికారులు మరమ్మతులు చేయాలని రైతులు కోరారు. లేకపోతే సాగర్కెనాల్కు మరింత ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదు..

సత్తుపల్లి: ప్రస్తుత తుఫాన్ హెచ్చరికల దృష్ట్యా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఏమాత్రం నిర్లక్ష్యం వహించినట్లు ఫిర్యాదులు వచ్చినా సహించేది లేదని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి హెచ్చరించారు. బుధవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో రోడ్లు, భవనాలు, పంచాయతీరాజ్, నీటిపారుల, ఆర్డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. నియోజకవర్గంలో నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు అంచనాలు రూపొందించి వెంటనే పనులు చేపట్టాలని ఆదేశించారు. పైపులైన్ లీకేజీల వల్ల తాగునీరు కలుషితమైతే విషజ్వరాలు వచ్చే అవకాశం ఉంటుందని సంబంధిత అధికారులు పైపులైన్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్, ఆర్అండ్బీ ఈఈ థానేశ్వర్, పంచాయతీరాజ్ డీఈఈ వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీల చైర్మన్లు ఆనంద్ బాబు, నీరజ, అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

ప్రతీ కుటుంబానికి అండగా ఉంటాం

వేంసూరు: మండలంలోని ఎర్రగుంటపాడు, రాజుగూడెం కందుకూరు వరద బాధిత కుటుంబాలకు బుధవారం ఎమ్మెల్యే రాగమయి నిత్యావసరాలు అందించారు. ఎవరూ అధైర్య పడొద్దని ప్రభుత్వం నష్టపోయిన ప్రతిఒక్కరికి సాయం చేస్తుందన్నారు. అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు దయనంద్, ఏఎంసీ చైర్మన్లు ఆనంద్బాబు, నీరజ, సోమిరెడ్డి, చంద్రశేఖర్రెడ్డి, రాఘవరెడ్డి, పైజుద్దీన్, జగన్మోహన్రెడ్డి, నరసింహారావు, వెంకటేశ్వరరావు, నాగులు, భాను, పకృద్దీన్ పాల్గొన్నారు.

ఫొటో గ్రాఫర్లు రూ.15,600 విరాళం

సత్తుపల్లి: రెండురోజులుగా కురుస్తున్న వానలకు ఖమ్మంలోని మున్నేరు వాగు పొంగి సమీపంలో ఉన్న ఫొటో గ్రాఫర్లకు సత్తుపల్లి మండల యూనియన్ నుంచి ఆర్థిక సాయం అందించారు. సత్తుపల్లి మండలం నుంచి జిల్లా బాధ్యులు కనకారావుకు రూ.15,600 అందించటం జరిగింది. కార్యక్రమానికి సోని స్టూడియో అధినేత పాషా అధ్యక్షత వహించగా హరి స్టూడియో మూర్తి, మారేష్, సుబ్బారావు, సౌజన్య స్యూడియో, అధ్యక్షుడు స్వామి, సుమాంజలి స్టూడియో రాము పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ


బాధితులకు నిత్యావసరాలు అందిస్తున్న లంకెల వెంకటరెడ్డి

మధిరరూరల్: మండలంలోని దేశినేనిపాలెంలో లంకెల వెంకటరెడ్డి, లంకెల సరస్వతి దంపతుల ఆర్థిక సాయంతో బుధవారం వరద బాధిత 90 కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లంకెల వెంకటరెడ్డి మాట్లాడుతూ.. వరద బాధితుల బాధలు చూడలేక వారికి 25 కేజీల బియ్యం, కందిపప్పు, పామాయిల్ ప్యాకెట్, చింతపండు, ఉల్లిగడ్డలు, పంచదార తదితర నిత్యావసరాలు అందించడం జరిగిందన్నారు. గ్రామస్తులు వెంకటరెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పెద్ద నర్సిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కోటేశ్వరరావు, మాజీ సర్పంచులు శ్రీనివాసరావు, మోహన్ రావు, మాజీ ఎంపీటీసీ పూర్ణచంద్ర రావు, మాజీ ఉపసర్పంచ్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలికి ఆర్థిక సాయం

కొణిజర్ల: ఇటీవల కురిసిన భారీ వానలకు మండలంలోని చిన్నమునగాలలో ఇల్లుకూలిన శతాధిక వృద్ధురాలు పాపగంటి లక్ష్మికి జిల్లా కాంగ్రెస్ నాయకుడు పరికపల్లి శ్రీనివాసరావుకు ఆర్థిక సాయం అందజేశారు. బుధవారం చిన్నమునగాలలో లక్ష్మి ఇంటిని పరిశీలించిన పరికపల్లి ఆమెతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేస్తున్న డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరు అయ్యేలా ఎమ్మెల్యే రాందాస్ నాయక్తో మాట్లాడి ఇప్పిస్తానని ఆమెకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బాబు, చిన్నబాబు, మురళి, అశోక్, ముత్తులింగం, శ్రీకాంత్, చుక్కయ్య, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

రెండు క్వింటాళ్ల బియ్యం స్వాధీనం

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి నుంచి ఏపీకి ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. సత్తుపల్లి నుంచి ఆటోలో రెండు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఏపీలోని చిన్నంపేటకు తరలిస్తుండగా పోలీసులకు పట్టుకున్నారు. ఈమేరకు ఆటో, బియ్యాన్ని స్టేషన్కు తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ టి.కిరణ్ తెలిపారు.

మాజీ ఎంపీటీసీ ఆత్మహత్యాయత్నం

కారేపల్లి: కుటుంబ కలహాల నేపథ్యాన ఓ మాజీ ఎంపీటీసీ ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. మండలంలోని సూర్యతండాకు చెందిన బానోత్ దళ్సింగ్కు కుమారుడితో వివాదం చోటు చేసుకుంది. దీంతో క్షణికావేశంలో ఆయన బుధవారం రాత్రి ఇంట్లోని ఉన్న పురుగుల మందు తాగగా కుటుంబీకులు ఖమ్మం ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.

తహసీల్దార్కు వినతి

గండి కొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని..

కల్లూరురూరల్: చెన్నూరులోని కొత్తకుంట చెరువుకు గండి కొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ.. రైతులు తహసీల్దార్ సాంబశివుడికి వినతిపత్రం అందించారు. గండి పడడంతో ఆయకట్టు రైతుల పంటలు నష్టపోవాల్సి వస్తుందని, చెరువుకు వేసిన గండిని పూడ్చాలని కోరారు. స్పందించిన తహసీల్దార్ జలవనరుల శాఖ అధికారులకు సమాచారం అందచేసి తక్షణమే కొత్తకుంట చెరువు గండిని పూడ్చివేయాలని ఎన్నెస్పీ అధికారులను కోరారు.

పంట నష్టపరిహారం ఇవ్వాలని..

చింతకాని: వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని కోరుతూ.. బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ అనంతరాజుకు బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మాట్లాడుతూ.. వ్యవసాయాధికారుల పంటల సర్వే చేసి తక్షణమే నష్టపరిహారం అందించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు వెంకట్రామయ్య, నాయకులు హనుమంతురావు, రత్నాకర్, కోటయ్య, నర్సయ్య, శ్రీను పాల్గొన్నారు.

దెబ్బతిన్న ఇళ్ల వివరాలు సేకరణ

ముదిగొండ: మండలంలోని ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న ఇళ్లను రెవెన్యూ అధికారులు బుధవారం పరిశీలించి వివరాలు సేకరించారు. మండలంలోని యడవల్లి లక్ష్మీపురం, న్యూలక్ష్మీపురం, గోకినేపల్లి, పండ్రేగుపల్లి, గంధసిరి గ్రామాల్లో భారీ వర్షాలకు ఇళ్లల్లోకి నీరు చేరడంతో దెబ్బతిన్న 94 నివాసగృహాల వివరాలు సేకరించారు. గంధసిరిలో వరద బాధితులకు తహసీల్దార్ టి.కరుణాకర్రెడ్డి నిత్యావసరాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు ప్రసన్నకుమార్, వహిదా, రవీందర్లు పాల్గొన్నారు.


కల్లూరురూరల్: గోడకూలిన ఇంటిని పరిశీలిస్తున్న ఆర్ఐ సుజాత

కల్లూరు మండలంలో..

కల్లూరురూరల్: మండలంలో ఖాన్ఖాన్పేట, పేరువంచ, ముగ్గువెంకటాపురం గ్రామాల్లో వర్షాల వల్ల పాక్షికంగా దెబ్బతిన్న గృహాలను రెవెన్యూ ఇన్స్పెక్టర్ సుజాత బుధవారం పరిశీలించి పంచనామ నిర్వహించారు. దెబ్బతిన్న గృహాల వివరాలను రెవెన్యూశాఖకు సమాచారం అందజేయాలని ఆమె కోరారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి


నాగభూషణం మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు

కొణిజర్ల: మండలంలోని పెద్ద గోపతికి చెందిన ఏఐటీయూసీ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కొల్లి నాగభూషణం బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీపీఐ జాతీయ సమితి నాయకుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాదరావు, జిల్లా నాయకుడు యర్రా బాబు నాగభూషణం మృతదేహాన్ని సందర్శించి ఎర్రజెండా కప్పి నివాళులు అర్పించారు. కార్మిక సమస్యల కోసం నిరంతరం శ్రమించిన నాగభూషణం మృతి పార్టీకి తీరని లోటన్నారు. నాగభూషణం మృతికి ఏఐటీయూసీ నాయకులు బీజీ క్లైమెట్, ఏపూరి రవీంద్రబాబు,తోట రామాంజనేయులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, భానోత్ భరత్, వేములకొండ రమేష్, యామాల గోపాలరావు, పలువురు మండల నాయకులు సంతాపం ప్రకటించారు. మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.